సీఎం జగన్‌తోనే సంక్షేమ రాజ్యం సాధ్యం

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు


పిప్పరలో ఎమ్మెల్యే వాసుబాబుకు సమస్యలు వివరిస్తున్న వృద్ధురాలు

గణపవరం: గత ప్రభుత్వంలో ప్రకటనలు, కాగితాలకే పరిమితమైన పేదల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ ఆచరణలో చేసి చూపిస్తున్నారని, మరింత సంక్షేమం కోసం మనమంతా ఆయనకు అండగా నిలవాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు అన్నారు. గురువారం గణపవరం మండలం పిప్పరలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి గత నాలుగేళ్లలో ప్రభుత్వం పేదలకు అందించిన పథకాలు వివరించారు. నవరత్నాల పథకాలద్వారా ముఖ్యమంత్రి జగన్ ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకుని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇన్ని సంక్షేమ పథకాలను నిర్విరామంగా, నిరాటంకంగా అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఒక్కరేనన్నారు. తండ్రి రాజశేఖరరెడ్డి బాటలో పాలన చేస్తానని చెప్పిన జగన్ ఆయనను మించి తండ్రిని మించిన తనయుడుగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. చంద్రబాబుతో సహా ఏ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలలో కనీసం 50 శాతం అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. జగన్ ఒక్కరూ నూరుశాతం హామీలను అమలు చేసి రికార్డు సృష్టించారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం బుధవారం అమ్మ ఒడి పథకం ఇచ్చారని, ఎవరికైనా అర్హత ఉండి అమ్మ ఒడి పథకం అందక పోతే వచ్చే నెల మొదటి వారంలో అమ్మ ఒడి మంజూరు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. తమకు ఇళ్లస్థలాలు ఇవ్వాలంటూ పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఇప్పటికే గ్రామంలో దరఖాస్తు చేసుకున్న వారందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని, అర్హులందరికి మళ్లీ రెండో విడత స్థలాలిస్తామని హామీ ఇచ్చారు. రోడ్లు, డ్రెయిన్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో పరిపాలన వికేంద్రీకరణ ద్వారా ప్రజల ముంగిటకే పాలన తీసుకువచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. ఏప థకానికైనా అర్హతే ప్రామాణికం తప్ప పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలు కాదన్నారు. మనబడి నాడునేడు కార్యక్రమం ద్వారా పేదల పిల్లలకు కార్పొరేటు సదుపాయాలతో విద్యను అందిస్తున్నామని, అమ్మఒడి, విద్యాకానుక, విద్యాదీవెన తదితర పథకాలను ఉపయోగించుకుని పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని తల్లిదండ్రులకు సూచించారు. జగన్ లక్ష్యంగా పచ్చమీడియా, ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాన్నినమ్మవద్దని, వాస్తవమేమిటో గ్రహించి, జగనన్నకు అందరూ అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు రాము, ఎంపీటీసీ సభ్యురాలు నీతిపూడి వీరమ్మ, వీరవల్లి దానమ్మ, పార్టీ నాయకులు కాకర శ్యాంసన్, ఐఎస్ఎన్ రాజు, దాట్ల సుబ్బరాజు, ముత్యాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొవ్వలిలో ఉపాధి పనుల ఆడిట్

దెందులూరు: మండలంలోని కొవ్వలి గ్రామంలో గతేడాది జరిగిన ఉపాధి హామీ పనులను గురువారం స్టేట్ రిసోర్స్ పర్సన్ రామచంద్రరావు తనిఖీ చేశారు. 40013 నెంబరుతో పంట కాల్వ పని ఎస్సీ శ్మశానవాటిక నుంచి పుట్టా సత్యం పొలం వరకు జరిగిన పనులపై అధికారులు తనిఖీ చేశారు.

జిల్లా పరిషత్ చైర్మన్‌కు అభినందనలు


ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌ను కలిసిన దెందులూరు వైఎస్సార్ సీపీ నాయకులు

పెదపాడు: ఉమ్మడి జిల్లాపరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావును దెందులూరు మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. చైర్‌పర్సన్‌ను పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. మండలంలోని పలు విషయాలను చర్చించారు. దెందులూరులో వెలమల ఆశాజ్యోతి తాండ్రపాపారాయుడు విగ్రహావిష్కరణ వంటి విషయాలపై చర్చించారు. తమ వంతు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు సంబంగి వేణుగోపాల తిలక్, రాజేష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డియ్య మృతి తీరని లోటు


రెడ్డయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆగడాలలంకకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గోవిందు నాగ వెంకట రెడ్డియ్య మృతి పార్టీకి తీరని లోటని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం గ్రామంలో రెడ్డియ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భలే రాంబాబు, ఎంపీపీ కనమాల రామయ్య, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, జిల్లా సాగు సలహా సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు గోలి సుబ్బారావు, సైదు గోపాలకృష్ణ, ఆదినారాయణ, రామకుర్తి నాగేశ్వరరావు, పాము మాన్‌సింగ్ పాల్గొన్నారు.

నేడు పిప్పరలో గడపగడపకు మన ప్రభుత్వం

గణపవరం: మండలంలోని పిప్పరలో శుక్రవారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి గురువారం వెలువడిన ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి, పశ్చిమ గోదావరి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఈ కార్యక్రమంలో పాల్గొని నాలుగేళ్లలో ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలు, లబ్ధిని గురించి వివరిస్తారని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగింపు సభ జరుగుతుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

నడిపల్లిలో...

పెదవేగి: మండలంలోని నడిపల్లి సచివాలయ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని మండల సచివాలయ కన్వీనర్ కేశన సతీష్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పాల్గొంటారని ఆయన చెప్పారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

దెందులూరు రైల్వే స్టేషన్ మూసివేత

దెందులూరు: దెందులూరు రైల్వేస్టేషన్‌లో శాశ్వతంగా ప్రయాణసేవలు నిలిచిపోయాయి. ఈ మేరకు రైల్వేశాఖ ఉన్నతాధికారులు అధికారికంగా ధ్రువీకరించారు. ఈ రైల్వేస్టేషన్‌లో రైళ్ల నిలుపుదల, టిక్కెట్లు ఇవ్వడం వంటివి ఉండవు. బ్రిటిష్ కాలంలో ఏర్పాటు చేసిన ఈ రైల్వేస్టేషన్ ఇప్పటి వరకు దెందులూరుతో పాటు సమీపంలోని గ్రామ శివారు ప్రాంత ప్రజలకు రైల్వే ప్రయాణసేవలను అందించింది. క్రమేపి ప్రయాణీకుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో రైల్వేశాఖ ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని అధికారులు వివరించారు.

నేడు సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన

ఏలూరు రూరల్: ఏలూరు మండలం గుడివాక లంకలో విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్య అతిథిగా హాజరవుతారు. సుమారు రూ.4 కోట్లతో చేపట్టే ఈ సబ్‌స్టేషన్ పూర్తయితే కొల్లేరు గ్రామాల విద్యుత్ సమస్యలకు చెక్ పడుతుంది. కొద్ది నెలల క్రితం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి చొరవతో ప్రభుత్వం సబ్‌స్టేషన్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఉంగుటూరు: అమృత్ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉంగుటూరు టోల్ ప్లాజా వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సామాజిక కార్యకర్త సోలాపురి ప్రసాదు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఏలూరు శంకర్ నేత్రాలయం ప్రత్యేక వైద్య బృందం సభ్యులు సేవలు అందజేస్తారని వివరించారు. ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమడోలు: సూరప్పగూడెం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని కొత్త 33 కేవీ లైన్ నిర్మాణ పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జిల్లా ఆపరేషన్స్ ఈఈ టి.శశిధర్ గురువారం రాత్రి విలేకరులకు తెలిపారు. కొత్త లైన్ ఏర్పాటులో భాగంగా భీమడోలు జంక్షన్ నుంచి సూరప్పగూడెం వరకు ఉన్న విద్యుత్ లైన్ పనులు జరుగుతాయన్నారు. సూరప్పగూడెం, ఆగడాలలంక విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో భీమడోలు, పోలసానిపల్లి, గుండుగొలను, లింగంపాడు, కోరుకల్లు, రత్నాపురం, వడ్డిగూడెం, భోగాపురం, ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రేమను పంచడమే బక్రీద్


దిబ్బగూడెంలో నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు


గణపవరం పెద్దమసీదులో మాట్లాడుతున్న పెద్దగురువు అర్మాన్ అన్సారీ


భీమడోలు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


గౌడవీధి మక్కా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పెదవేగి : ప్రేమను పంచేది బక్రీద్ అని దిబ్బగూడెం అబ్దుల్ బిన్ అబ్బాస్ మసీదు ఇమామ్ పఠాన్ సుబానీ చెప్పారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం పెదవేగి మండలంలో వేగివాడ, ముండూరు, రాయన్నపాలెం, న్యాయంపల్లి, దిబ్బగూడెం, ములక్కాయలపాడు, తదితర గ్రామాల్లో ముస్లిం సోదరులు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు షేక్ కరీం, షేక్ సలీమ్‌బాషా, పఠాన్ మస్తాన్, ఖాసిం, పఠాన్ అల్లాబక్షు, బాజీ పాల్గొన్నారు.

బక్రీద్ శుభాకాంక్షలు : ఎమ్మెల్యే

దెందులూరు: నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు బక్రీద్, తొలి ఏకాదశి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు

దెందులూరు: మండలంలో బక్రీద్ వేడుకలు భక్తిశ్రద్ధలతో గురువారం జరిగాయి. దెందులూరు ఎస్ఎంఆర్ నగర్‌లోని అరెహమాన్ మజ్జీద్‌లో ఫజ్లుల్ రహమాన్, గౌడ వీధిలోని మక్కా మసీదులో ఇమామ్ అబ్దుల్లా బక్రీద్ వేడుకలు సందర్భంగా అల్లా బోధనలు వివరించారు. బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకున్నారు. నాగులదేవునిపాడు, కొవ్వలి, సీతంపేట, మేధినరావుపాలెం, గంగన్నగూడెం, మజ్జీదుల్లో ముస్లిం సోదరులు బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు.

త్యాగాల ప్రతీక బక్రీద్

గణపవరం: బక్రీద్ పండుగ అంటే త్యాగాలకు ప్రతీక అని, ముస్లింలు తోట వారిపట్ల ప్రేమ ఆదరణ కలిగి ఉండాలని గణపవరం పెద్ద మసీదు గురువు అర్మాన్‌అన్సారీ అన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని గణపవరం పెద్ద మసీదులో గురువారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలనుద్దేశించి అర్మాన్ మాట్లాడుతూ పేద, ధనిక అనే తేడా లేకుండా ముస్లింలు ప్రతీ ఒక్కరూ ఈపండుగను ఆనందంగా జరుపుకుంటారని అన్నారు. కార్యక్రమంలో మసీదు చిన్నగురువు ఎండీ ఫారూఖ్, షేక్ ఇస్మాయిల్, మసీదు అధ్యక్షుడు ఎండి ఖాదర్‌ఖాన్, ఎండీ బహదూర్, షేక్ రహంతుల్లా, షేక్ నాగూర్, షేక్ బషీరుద్దీన్, మహ్మద్ జానీ తదితరులు పాల్గొన్నారు.

భీమడోలులో..

భీమడోలు: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీదు పర్వదినాన్ని ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని భీమడోలు, అంబర్‌పేట, పూళ్ల, పోలసానిపల్లి, పాతూరు, గుండుగొలను గ్రామాల్లోని మసీదు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన ముస్లింలంతా తరలి వచ్చి మసీదుల్లో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేసారు. భీమడోలు మసీదు కమిటి అధ్యక్షుడు, వైసీపీ నియోజకవర్గ ముస్లిం మైనార్టీ సెల్ కన్వీనర్ షేక్ రహీమాబేగం హసేనా ఆధ్వర్యంలో బోదోకులు దిల్షాద్ బక్రీదు పండుగ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు షేక్ హుస్సేన్, సభ్యులు షరీఫ్, జానీ, గాలిబ్, నాగూర్, మెహబూబు పాల్గొన్నారు.

పెదపాడులో..

పెదపాడు: మండలంలోని పెదపాడు బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు. పెదపాడు మండలంలోని తోటగూడెం గ్రామంలో ఇటీవల దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముస్లింలకు ప్రార్థనా మందిరం కోసం కేటాయించిన స్థలంలో నమాజ్ నిర్వహించారు. ముస్లిం సోదరులంతా త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షేక్ మీరాఖాన్, బొజ్జాసాహెబ్, ఖమల్, తదితరులు పాల్గొన్నారు. అప్పనవీడు గ్రామంలోను, పెదపాడు, వట్లూరు, వసంతవాడ గ్రామాల్లో బక్రీద్‌వేడుకలు నిర్వహించారు.

వైభవంగా తొలిఏకాదశి పూజలు


గుండుగొలనులో స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

భీమడోలు: గుండుగొలనులో ఉన్న శ్రీసీతా రామస్వామి వారి ఆలయంలో లోక కల్యాణార్థం విశేష చతుర్మాస పూజోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గత ఐదు దశాబ్దాలుగా ఈ ఆలయంలో చతుర్మాస పూజోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగరాజ్ కుమార్ ఆధ్వర్యంలో వచ్చే నెల 8 వరకూ జరగనున్న పూజా కార్యక్రమాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తొలి ఏకాదశని పురస్కరించుకుని ఆలయ పూజారులు సుధీరాచార్యులు, పూజారుల బృందం చతుర్మాస దీక్ష వ్రతారంభం చేశారు. ఈ సందర్భంగా స్వామి వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు

పెదపాడు: మండలంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5గంటల నుంచి సాయంత్రం వరకు భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వట్లూరులోని వేణుగోపాలస్వామి ఆలయంలోను, పాతముప్పర్రు గ్రామంలోను ప్రత్యేక పూజలు జరిపారు.

గ్రామ దేవతలకు ఆషాఢం సారె


ఉండ్రాజవరం గ్రామంలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ఆషాఢం సారె అందజేస్తున్న గ్రామ మహిళలు

దెందులూరు: అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మలుగా విరాజిల్లుతూ ఉండ్రాజవరం గ్రామాన్ని కంటికి రెప్పవలే కాపాడుతున్న తల్లులు శ్రీ కనకదుర్గమ్మ తల్లి, శ్రీ సోమాలమ్మ తల్లి, శ్రీ పుంతల ముసలమ్మ తల్లి అమ్మవార్లకు ఉండ్రాజవరం గ్రామ మహిళలు గురువారం ఆషాఢం సారెను అందజేశారు. గ్రామంలోని మహిళలందరూ ఊరేగింపుగా మేళతాళాలతో, మంగళవాయిద్యాలతో కోలాటాల నృత్యాల నడుమ గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఉండ్రాజవరం గ్రామ ఆడపడుచులుగా పూజలందుకుంటున్న ముగ్గురు అమ్మవార్లకు ఆషాఢం కానుకగా పుట్టింటి సారెను గ్రామ మహిళలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని చూడటానికి ఉండ్రాజవరంతో పాటు సమీప గ్రామాల్లోని మహిళా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

రాట్నాలమ్మకు ఆషాఢం సారె

పెదవేగి : తొలి ఏకాదశి పురస్కరించుకుని ఆలయాల్లో వైభోపేతంగా పూజలు నిర్వహించారు. గురువారం పెదవేగి మండలం రాట్నాలకుంటలో ఆషాడ మాసం సందర్భంగా తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏలూరు జిల్లా బలివే వెంకటాపురం గ్రామస్తులు శ్రీ రాట్నాలమ్మ అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో ఆషాడ సారెను సమర్పించారు. తొలుత సారె తీసుకువచ్చిన వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి సారె ప్రసాదాన్ని అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సారె సమర్పించారు. సారె సమర్పించిన భక్తులకు దేవాలయ అర్చక స్వాములు ఆశీర్వచన చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

జన జాగృతి సభను విజయవంతం చేయండి


రాయన్నపాలెంలో జన జాగృతి సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెదవేగి : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ నాయకత్వంలో జులై 7న విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో తలపెట్టిన జనజాగృతి సభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు యర్రా నాగమల్లేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు. గురువారం పెదవేగి మండలం రాయన్నపాలెంలో ఎంఆర్‌పీఎస్ సీనియర్ నేత అబ్బదాసరి శౌరి మాదిగ అధ్యక్షతన జన జాగృతి సభకి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాదిగల జన జాగృతి సభను విజయవంతం చేయడానికి మాదిగ, మాదిగ ఉపకులాలు అందరూ తరలివచ్చి విజయకేతనం ఎగరవేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. రాబోయే రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేయకపోతే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ నాయకులు కొల్లూరి రామకృష్ణ, స్థానిక నాయకులు, తనగాల రెడ్డియ్య, అబ్బదాసరి ప్రకాష్, ఆకుమర్తి చిన్న తదితరులు పాల్గొన్నారు.


వేగంగా సీసీ రోడ్డు నిర్మాణం


చేబ్రోలు సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఇచ్చిన హామీ నెరవేరింది. గ్రామ పంచాయతీ ఆఫీసు ఎదురుగా ఉన్న వీధి పల్లం అయిపోవడంతో ప్రజలు గడపగడపకు మన ప్రభుత్వంలో వాసుబాబు దృష్టికి తీసుకువచ్చారు. అయితే సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే వాసుబాబు రూ.20 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు సీసీ రోడ్డును వేగంగా నిర్మిస్తున్నారు. గురువారం రోడ్డు నిర్మాణా పనులను నాయకులు మనసాల నాగమణి, పాపారావు బాబ్జి, రందేరాజు, ఆకులరాజు తదితరులు పరిశీలించారు.

సంక్షేమంలో చరిత్ర సృష్టించాం

- దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- నడిపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం


నడిపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం పాల్గొన్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి

పెదవేగి : ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో చరిత్ర సృష్టించామని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. పెదవేగి మండలం నడిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం గురువారం కోలాహలంగా నిర్వహించారు. అడుగడుగునా ప్రజలు పూలహారతులు పట్టి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అభివృద్ధి గురించి వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అంటూ ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి పథకాలు అందని వారు ఉంటే, వారి వివరాలు సేకరించి పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, వలంటీర్లకు సచివాలయ సిబ్బందికి సూచించారు. ప్రజలనుంచి వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చరిత్ర సృష్టించారని చెప్పారు. ఈ మేరకు ఇచ్చిన ప్రతీ మాట నిలబెట్టుకుని అమలు చేశామని, ప్రజలు కూడా ఓటు వేసి గెలిపించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకున్నామని, ఈ ప్రభుత్వంలో మీకు లబ్ధి చేకూరిందని బావిస్తేనే ఓటు వేయాలని బహిరంగంగా అబ్బయ్యచౌదరి ప్రజలను కోరారు. గ్రామంలో వలంటీర్ వ్యవస్థ పనితీరు బాగుందని ప్రజల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం పై సానుకూల స్పందన ఉందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ తాతా రమ్య, బీసీ నాయకులు ఘంటా ప్రసాదరావు, విజయరాయి సొసైటీ అధ్యక్షుడు పాలడుగు పెదబాబు, ముండూరు సొసైటీ అధ్యక్షుడు చెరుకూరి ప్రసాద్, గ్రామ నాయకులు ఉక్కుర్తి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ మద్దాల మోహనరావు, మేక రమేష్, గొట్టేటి స్టాలిన్, మట్టా రాంపండు, మద్దాల వాసుదేవరావు, మద్దాల గోపాలరావు, చల్లారి నాగు, గుంటూరి జార్జ్, మేక నారాయణరావు, నక్కా బాబు, గొడ్డాటి విజయరాజు, గొడ్డాటి తాతారావు, వెంట్రపాటి విలియం, వెంట్రపాటి మహేష్, ఇతర గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.